గత సంచిక తరువాయి

# బాధాసప్తశతి

■ నెమలూరి భాస్కరరావు



ఆ వ్యాపారం ప్రారంభించాక కుర్రవాడు సంతోషంగానే కనిపించాడు. తన స్నేహితులందరి ముందూ తానూ ఓ వ్యాపారస్థుడిననే బడాయి ప్రదర్శించుకోడానికి వాడికి అవకాశం ఏర్పడింది. సవ్యంగా ఒళ్ళు దగ్గర పెట్టుకుని చేసుకుంటే ఖర్చులన్నీ పోను ఓ సంసారం దివ్యంగా బతకడానికి కావాల్సిన ఆదాయం ఆ వ్యాపారంలో వస్తుంది. వాడికున్న సర్కిలు, నా సర్కిలు కారణంగా బిజినెస్ బాగా క్లిక్ అయింది. అయితే, సంవత్సరాంతలో లెక్కలు చూసుకుంటే, లాభం లక్షరూపాయలు మిగలాల్సింది పోయి మరో యాభైవేలు పైచిలుకు నష్టం కనిపించింది. ఏమిట్రా ఇది అని అడిగితే మొదటి సంవత్సరం కదా! ఖర్చులు ఎక్కువవుతాయిలే అని చెప్పాడు. వ్యవసాయం చేసుకొనేవాడివి వ్యాపారం గురించి నీకేం తెలుసు? అన్న భావన కూడా వాడి మాటల్లో బలహీనంగానైనా ధ్వనించి మౌనంగా ఊరుకున్నాను. తరువాత వాళ్ళమ్మ చెప్పింది. వ్యాపారం ప్రారంభించిన నాటినుంచీ వాడు కనీసం ఇరవై జతల బట్టలు కొన్నాడనీ, ఆ సంవత్సరంలోనే ఆరేడు చెప్పుల జతలు మార్చాడనీ, అయిదారు సార్లు రాత్రుల్లో వాడింటికి వచ్చినప్పుడు తాగిన వాసనొచ్చిందనీ! స్నేహితులూ, తానూ కలిసి వెళుతున్నామని చెప్పి ప్లెజర్ ట్రిప్ పేరిట మద్రాసూ, ఊటీ కూడా వెళ్ళొచ్చాడు. రోజూ ఓ ఇరవై రూపాయలు సిగరెట్లకు ఖర్చు చేస్తున్నాడు. స్నేహితులకూ తనకూ కలసి రోజూ నలభైదాకా టీలకు అవుతోంది. అదికాక జ్యూసుల కింద మరికొంత ఖర్చు పెడుతున్నాడని పక్క షాపులవాళ్ళు చెప్పారు. వాడికి చాలా ఆత్మన్యూనతా భావం. దాన్ని కప్పిపుచ్చుకోవడానికి, ఆధిక్య భావాన్ని ప్రదర్శించడానికీ తంటాలు పడుతుంటాడు. విద్యో, మరేదైనా గొప్పతనమో సాధించి ఉంటే ఆధిక్యభావం కాణీ ఖర్చు లేకుండా ప్రదర్శించవచ్చు. అది వాడికి లేని కారణంగా ఆధిక్యాన్ని ప్రదర్శించడానికి డబ్బు విచ్చలవిడిగా ఖర్చు చేయడం అనేదాన్ని ఆశ్రయించాడు. ఫలితంగా వ్యాపారంలో లాభం పోగా నష్టం వచ్చిందని అర్థమైంది. నష్టాన్ని గురించి నేనెక్కడ నిలదీస్తానో అని భయం పట్టుకొని వాడా భయం నుంచి పలాయనం కావడానికి మందును ఆశ్రయించాడు. దాంతో మరింత ఆర్థిక నష్టాలు ఎదురయ్యాయి. వీటికితోడు ఆ కుర్రాడికి జీవితానికి సంబంధించిన సమగ్రమైన ప్లానూ, దృక్పథం లేదు. కారణం- కలలుగనే స్నేహితులూ, స్థితికి మించిన కోరికలూ, దురాశా ఉండడమే. అదికాక ఇవన్నీ ఉన్నవాళ్ళకు ఏర్పడే బాధ్యతారాహిత్యం కూడా!

డబ్బు సంపాదించాలనే తపనే తప్ప, దాన్ని నిలబెట్టుకొనే విజ్ఞత, ప్లానూ లేకపోవడం, డబ్బు విచ్చలవిడిగా ఖర్చుచేస్తే అందరూ తనను గొప్పవాడిగా చూస్తారనే అమాయకత్వం, అజ్ఞానంతో వాడు మొదటి సంవత్సరం నష్టం తెచ్చాడు. వీటన్నిటికన్నా ముఖ్యమైంది ఒకసారి డబ్బు చేతిలో తిరిగేసరికి ఆకలిగొన్నవాడు ఆబగా అన్నం తిని అజీర్ణంతో బాధ పడ్డట్టు దుబారా చేశాడు.

లెక్కలు చూశాక వాడికి వివరంగా అనేక విషయాలు చెప్పాను. గద్దంత ఎత్తు ఎగరాలని కోడిపెట్ట ప్రయత్నం చెయ్యకూడదనీ, కాళ్ళు విరుగుతాయనీ, నీ స్నేహితులు నీకన్నా ధనవంతులు, వాళ్ళతో నువ్వు సంపాదించడంలో పోటీపడు తప్ప ఖర్చు చెయ్యడంలో కాదని, ప్లానుగా బతకడం నేర్చుకోకపోతే, తెగిన గాలిపటంలా అయిపోతావనీ, మరో అవకాశం కల్పిస్తాను వెర్రివేషాలు మానకోమనీ చెప్పి మళ్ళీ రెండవ సంవత్సరం కోసం మరికొంత పెట్టుబడి బ్యాంక్ లోన్ తెచ్చి పెట్టాను.

"ఒరేయ్ చలపతీ! నీ కొడుకూ, సంసారం, వ్యాపారం గురించి ఏకబిగిన యాభై ఎపిసోడ్ల సీరియల్ చూపించినట్లు సంవత్సరం చరిత్ర చెప్పావు. ఇప్పుడో కప్పు టీ నీళ్ళు నా ముఖాన పోస్తే తప్ప నువ్వు చెప్పే మిగతా ఎపిసోడ్సు విన్లేను. ఆనక నీ ఇష్టం" అన్నాను నవ్వుతూ నేను.


"వెధవా! నీ బలహీనతలు నాకు తెలియనివా! ఆ ఏర్పాటు చేశాన్లే" అని వాడు అంటుండగానే వాడి చిన్న కొడుకు రెండు కప్పుల టీ ట్రేలో తెచ్చి ఇద్దరికీ చెరో కప్పు ఇచ్చాడు. అదనంగా నాకో సిగరెట్టు ప్యాకెట్టు తెచ్చి ఇచ్చాడు. టి సిప్ చేస్తూ మెచ్చుకోలుగా చలపతిగాడి వంక చూశాను. తరువాత ఫ్రెష్‌గా సిగరెట్టు ముట్టించి గుండె నిండా పొగ పీల్చి చలపతి చెప్పేది శ్రద్ధగా వినసాగేను.

"వ్యాపారం రెండవ సంవత్సరంలో మరింత ప్రోత్సాహకరంగా అభివృద్ధి చెందింది. అయితే, మావాడు మాత్రం మానసికంగా మరింత చెడిపోయాడనీ చెప్పక తప్పదు. ఆ సంవత్సరం చివర్లో లెక్కలు మళ్ళీ చూశాను. ఈసారి అసలు జోలికి పోలేదు గానీ లాభం మొత్తం మేసేశాడు. 'ఏమిట్రా ఇది' అని అడిగితే అసలు ఎక్కడికీ పోలేదుగా. కష్టపడి సంపాదించింది పోయిందంటే' అన్నాడు చాలా తేలిగ్గా.

వాడి ధోరణికి నేను విస్తుపోయాను. ఇంత ఆలోచనా జ్ఞానం లేని ఈ కుర్రాడు భవిష్యత్తంతా దుఃఖమయం చేసుకుంటాడు కదా ఎలాగా అని మథనపడ్డాను. ఈ క్షణాన్ని గురించి తప్ప రేపటి గురించి ఆలోచించని ఈ పిల్లాడు జీవితంలో ఎదుర్కోబోయే కష్టాల గురించి ఆలోచిస్తే నాకు ఏం చెయ్యాలో వాడికెలా బోధించాలో అర్థం కాలేదు. ఆ తరువాత వాళ్ళమ్మ మరికొన్ని విషయాలు చెప్పింది. 'ఈ వయసులో కాక మరి

చిత్రాలు: నర్సిం

సుఖపడేది ఎప్పుడు? గడ్డాలూ, మీసాలూ తెల్లబడ్డాకనా?" అన్నాట్ట. 'అయినా, ఇప్పుడు చేస్తున్న వ్యాపారం ఎంత? దాన్లో వచ్చే లాభం ఎంత? గట్టిగా ఎన్‌జాయ్ చేస్తే సాదరు ఖర్చులకు చాలదు' అన్నాట్ట. 'ఓ పది లక్షలు ఇచ్చి చూడమను. సంవత్సరానికి రెండుమూడు లక్షలు లాభం సంపాదించి ఆయన చేతుల్లో పోస్తాడు' అన్నాట్ట. 'వాడు కట్టు తప్పిపోతున్నాడు. వెంటనే పెళ్ళి చేస్తే మంచిది. దారికొస్తాడేమో' అంది మా ఆవిడ. నిజం చెబుతున్నాను చలపతీ! మావాడి ప్లానింగ్, ఆచరణా నాకు గగుర్పాటూ, వెలపరమూ కలిగించాయి. యౌవనం తొణికిసలాడే వయసులో ఎవరైనా అహోరాత్రాలు కష్టపడాలి. వయసు పైబడ్డాక కష్టపడాలంటే కోరిక ఉన్నా శరీరం సహకరించదు. అందువల్ల అప్పటికి సుఖాలు పొందే సౌకర్యాల్ని సంపాదించి రిజర్వులో ఉంచుకోవాలి. కానీ, ఈ తరం యువకుల స్పీడు దానికి రివర్సులో ఉంది. వాళ్ళ స్పీడు కారణంగా వాళ్ళు యాక్సిడెంట్‌కు గురికాక తప్పదు అనిపిస్తోంది. శక్తియుక్తుల్నీ, ధనాన్నీ, ఆరోగ్యాన్ని నాశనం చేసుకొనే ఈ స్పీడు వాళ్ళు సుఖం అనుకొని భ్రమపడుతున్నారు.



ధనం ఈ సమాజంలో కొద్దిమంది దగ్గరే ఎందుకు గుట్టలుగా పోగుపడిపోతోందో వీళ్ళకు అర్థం కావడం లేదు. ఆ పదిమందిలో తామూ ఒకరం కావాలని వీళ్ళు తపన పడుతున్నారు. ఇది పగటి కల మాత్రమే. ఈ రేస్‌లో వాళ్ళు ఓడిపోతారు. చితికిపోతారు. జీవితాంతం వీళ్ళకు తెలియకుండానే వీళ్ళు దుఃఖాన్ని కౌగలించుకునే వైపు పరుగులు తీస్తున్నారు. ఉన్నదానిలో తృప్తి చెందడం చేతకాని వీళ్ళు లేనిదానికోసం పరుగులు తీస్తూ జీవితాన్ని దుఃఖభాజనం చేసుకొంటున్నారు. వాళ్ళకొక్కరికే కాదు ఆ పరిస్థితి దాపురించేది, వాళ్ళతో ముడిపడి ఉన్న సంసారం అంతటికీ ఆ పరిస్థితిని సంక్రమింపజేస్తారు తప్ప ఈ మూర్ఖులు సాధించేదేమీ ఉండదు. ఎదుటివాడికి ఉండడం ఏమిటి? నాకు లేకపోవడం ఏమిటి అనే వ్యక్తిగత భావావేశమే ఉంది వీళ్ళకు. కొందరికి ఉండడమేమిటి, ఎక్కువమందికి లేకపోవడం ఏమిటి అనే సామాజిక స్పృహ లేని వీళ్ళు ఒంటరిగా పరుగుతీసి అలిసిపోతారు. విసిగిపోతారు. నిరాశలో, దుఃఖంలో కూరుకొనిపోతారు- తమ కోరిక తీరక. ఈ పరుగు, తపన జనం కోసం అయితే, ఓడిపోయినా సంతృప్తీ, గుర్తింపూ అయినా మిగుల్తాయి. ఈ విషయం వీళ్ళకెలా అర్థం చేయించాలి. సరే, ఇప్పుడు లోకకల్యాణం సంగతి ఎందుకులేగానీ, నా కొడుకు విషయానికి వస్తాను. వాడీతరంలోని అధికశాతం మధ్యతరగతి యువకులకు నకలు. సాధించలేని లక్ష్యాలు నిర్ణయించుకొని దాని కింద నలిగిపోయి దుఃఖంలోనూ, నిరాశలోనూ మునిగిపోతోంది యువత. వాళ్ళను ఆకాశంలోనించి కిందికి దించి పరిమిత లక్ష్యాలు నిర్ణయించుకొనేలా, అవి సాధించడం ద్వారా దొరికే తృప్తిని వాళ్ళకు ఎలా అనుభూతం చేయించాలి? ఇదీ నా అవేదన. యువత అంటే సమూహమే అయినా, ప్రస్తుతానికి నా కొడుకే నా దృష్టిలో ఉన్నది.

చిన్న వ్యాపారం అని వాడు అనుకొంటున్నది నా దృష్టిలో చిన్నది కాదు. అది నిర్ణయాత్మకమైనది. వాడి శక్తిసామర్థ్యాలూ, తెలివితేటలూ సక్రమంగా నాకు అర్థం చేయించి, వాడి మీద నాకు నమ్మకం కలిగించడానికి వాడు పునాదిగా దాన్ని ఉపయోగించుకోవాలి. అలా కాక వాడు దాన్ని అపసవ్యంగా- వాడిమీద నాకు ఎంతమాత్రం నమ్మకం కలగకుండా ఉండేలా నిర్వహించాడు.

పది అడుగులు సవ్యంగా నడవలేనివాడు పది కిలోమీటర్లు నడుస్తాడంటే ఎలా నమ్మడం? అంతేకాక వాడు ఎంత స్పీడుగా ఆ వ్యాపారాన్ని పాడుచేశాడో, అంతే స్పీడుగా ఇంకా పెద్ద పెట్టుబడి కావాలని కలలు కంటున్నాడు. పాడుచేసినంత త్వరగా ఏదీ బాగుపర్చలేం అనే విషయం వాడికి అర్థం కాలేదు. పాడుచేసిందాన్ని బాగు చెయ్యడానికి ఓపిక లేక కొత్తది కొనుక్కోవాలని కోరుకునే వాడికి పాడుచేయడమే తప్ప నిర్మించడం తెలియదు.

ఇది వాణ్ణి నేను అర్థం చేసుకున్న తీరు. ఈ దశలో మా ఆవిడ వాడికి పెళ్ళి చేద్దాం అంది. నేనూ సరే అన్నాను. పెళ్ళి ఎలా జరిగిందో చూశావుగా. వాడి బేషజాలకు, బడాయికోరుతనానికి నేను అనేకమంది విమర్శలకు గురి అయ్యాను. మా మామగారు పెళ్ళిపందిరిలో నీ దగ్గర ఈ పెళ్ళిని గురించి ఎలా విమర్శించాడో గుర్తుందిగా! అదంతా వాస్తవమే. కట్నం కింద పొలం వద్దన్నాడు. డబ్బు తీసుకోమన్నాడు. బండి, నగలు అడిగాడు. అన్నీ వాడు చెప్పిన విధంగానే జరిపించాను. పెళ్ళి ఆడంబరంగా వాడి బడాయిని సంతృప్తిపరిచే విధంగా చేశాను. పెళ్ళికి రెండురోజులు ముందు వాళ్ళమ్మతో అన్నాట్ట, 'నాన్నకు సంపాదించడం తెలీదు. ఖర్చు చెయ్యడం తెలీదు. వెనకటి కాలం వాడు' అని. కట్నం డబ్బు మూడు లక్షలూ, మరో అయిదు ఎకరాలూ అమ్మి ఆ డబ్బు తన చేతికిస్తే ఫైనాన్స్ కంపెనీ పెట్టి సంవత్సరానికి రెట్టింపు సంపాదించి ఇస్తానన్నాడు.

వాళ్ళమ్మకు వాడిపట్ల చాలా సాఫ్ట్ కార్నరుంది. నాకు లేదని కాదు. అయితే, నా ఇంగితం నన్ను ఉట్టికెగరలేనమ్మ స్వర్గానికి ఎగురుతుందా? అని హెచ్చరిస్తోంది. ఇదిరా చలపతీ నా సమస్య. ఏం చెయ్యాలో పాలు పోలేదు. నీ సలహా ఏమిటో చెప్పు" అంటూ ఆగి ఊపిరి పీల్చుకున్నాడు చలపతి.

నేను సిగరెట్టు దమ్ము పీల్చి రెండు నిమిషాలు మౌనం వహించాను. చలపతి నా సలహా కోసం చాలా ఆత్రంగా ఎదురుచూస్తున్నాడని నాకు తెలుసు.

"చూడు చలపతీ! నీ సమస్య చాలా సున్నితమైంది. పైగా దీన్లో చాలా సెంటిమెంట్లూ, రక్తసంబంధాలూ ఇమిడి ఉన్నాయి. డైరెక్టుగా నీకు ఈ విషయంలో సలహా చెప్పడం ఇంగితం కాదనిపిస్తోంది. కాబట్టి ఓ కథ చెప్తాను విను. అది నీకు ఉపయోగపడితే దాని వెలుగులో ఏదైనా నిర్ణయం తీసుకో. లేదా ఒదిలేసి నీకు తోచిన మార్గాన్ని అనుసరించు" అంటూ మరో సిగరెట్టు ముట్టించి కథ చెప్పడం ప్రారంభించాను...

"అనగనగా ఓకాకి. దానికి ముగ్గురు పిల్లలు. తల్లికాకి వాటిని పెంచి ప్రయోజకులను చెయ్యాలని కలలు కనేది. ముక్కుతో పుల్లలు ఏరి తెచ్చి వాటికోసం ఓ గూడు కట్టింది. అది శత్రువులకు అంతనంత ఎత్తులో ఓ రావి చెట్టు మీద కట్టింది. పిల్లలకు పుల్లలు గుచ్చుకోకుండా గూట్లో కొబ్బరి పీచులు ఏరుకొచ్చి పరిచింది. రాత్రిపూట చలిగాలి తగలకుండా తన రెక్కల కింద పిల్లల్ని పొదువుకునేది.

> "సమాజంలో ధనం కొద్దిమంది దగ్గరే ఎందుకు గుట్టలుగా పోగుపడి పోతోందో వీళ్ళు అర్థం చేసుకోరు. వాళ్ళలో తామూ ఒకరం కావాలని వీళ్ళ తపన."

మెత్తగా పిల్లలకు తేలిగ్గా జీర్ణం కావడానికి అన్నం మెతుకులు ఏరి తెచ్చిపెట్టేది. ఆ విధంగా పిల్లలకు ఏ లోపమూ లేకుండా తల్లికాకి పెంచసాగింది. పిల్లలు కూతకొచ్చాయి. రెక్కలు టపటపా కొట్టుకుంటూ మెల్లిగా గూట్లోంచి కొమ్మలమీదకు ఉరకసాగాయి. ఒక కొమ్మమీంచి మరో కొమ్మకి మెల్లగా ఎగరడం తల్లి పర్యవేక్షణలో ప్రాక్టీసు చేశాయి.

తల్లికాకి లోకంలో తమబోటి అల్ప ప్రాణులు బతకాలంటే ఎలాంటెలాంటి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందో పిల్లలకు వివరించి చెప్పసాగింది. తన జీవితానుభవాన్నీ, తమ పెద్దల జీవితానుభవాన్నీ ఆ తల్లి తన పిల్లలకు బోధపరుస్తూ కాకిబతుకును ఎలా సార్థకం చేసుకోవాలో వాటికి నేర్పడానికి ప్రయత్నించసాగింది. పిల్లలు క్రమంగా చిన్నచిన్న పురుగుల్ని వేటాడి అప్పుడోటీ అప్పుడోటీ సంపాదించి ఆ విషయం తల్లికి చెప్పి మురిసిపోతున్నాయి. ప్రయోజకులవుతున్న తన సంతానాన్ని చూసి తల్లికాకి కించిత్ సంతోషాన్ని కూడా అప్పుడప్పుడూ పొందసాగింది.

ఓ శుభ ముహూర్తంలో తల్లికాకి తన పిల్లల్ని తీసుకొని ఆహారాన్వేషణకు బయలుదేరింది. ఆహారం సంపాయించుకోవడంలోని మెళకువల్ని ప్రతిరోజూ పిల్లలకు నేర్పసాగింది. అలా ఓ నెల రోజులు గడిచిపోయాయి. ఇంకొక్క నెలరోజులు వీటిని వెంటపెట్టుకొని తిప్పితే తరువాత వాటి మానాన వాటిని వదిలేయవచ్చు అనుకొంది తల్లికాకి. ఆ రోజు ఎప్పటిమాదిరిగానే ఉదయాన్నే పిల్లల్ని వేసుకొని ఆహారం కోసం బయలుదేరింది తల్లికాకి. ఓ చక్కటి పెంకుటిల్లు ఎంచుకొని పిల్లల్తో సహా ఆ ఇంటి గోడమీద వాలింది. ఆ సమయానికే రోజూ ఆ ఇంటివాళ్ళు అంట్ల గిన్నెలు కడిగి మెతుకులూ గట్రా బావి దగ్గర పారేస్తారు. తల్లికాకి ఆశగా, పరిశీలనగా బావి పళ్ళెంవేపు చూసింది. పళ్ళెం నిండా అక్కడోటీ అక్కడోటీ పర్చినట్లున్నాయి. అన్నం మెతుకులు. హమ్మయ్య! కడుపునిండా భోజనమే అనుకుంది తల్లికాకి. వెళ్ళి ఏరుకుతినండి అని పిల్లలకు చెబుదాం అనుకున్న కాకి తల్లికి హఠాత్తుగా ఓ ఆలోచన వచ్చింది. పిల్లలకు ఈ వేళ చెప్పాల్సిన పాఠం ఒకటుంది. అది చెప్పి పంపిస్తే మంచిదనిపించింది.

"చూడండి చిట్టితల్లులూ! ఆ బావి పళ్ళెంనిండా అన్నం మెతుకులే. మీరు అక్కడికి వెళ్ళి ఏరుకొని తింటున్నారనుకోండి. ఆ సమయంలో మీకు పది గజాల దూరంలోకి ఓ మనిషి వచ్చి హఠాత్తుగా వంగున్నాడనుకోండి. అప్పుడు ఏం చేస్తారు?" అని తల్లికాకి పిల్లకాకుల్ని అడిగింది.

అప్పుడో పిల్లకాకి "వాడు వంగుంటే మనకెందుకూ, కూర్చుంటే మనకెందుకూ! హాయిగా మెతుకులు ఏరుకొని తింటాను" అంది.



"తప్పమ్మా, అలా చేయకూడదు" అని చిరునవ్వు నవ్వింది తల్లికాకి.

"మరేం చెయ్యాలమ్మా! నువ్వే చెప్పు" అంది రెండో పిల్లకాకి.

తల్లికాకి చెప్పసాగింది- "మీకు పదిగజాల దూరందాకా వచ్చిన మనిషి హఠాత్తుగా వంగాడంటే అర్థం వాడు మిమ్మల్ని కొట్టడానికి ఏ రాయి కోసమో వంగాడని అర్థం చేసుకొని వెంటనే లేచి పారిపోవాలి. లేదంటే వాడి చేతుల్లో మీరు చచ్చిపోయే ప్రమాదం ఉంది" అంది.

"అమ్మా! నువ్వు చెప్పింది బాగానే ఉంది కానీ, ఎవడైనా మనిషి జేబులోనే రాళ్ళు వేసుకొని వచ్చాడనుకో. వాడు పది గజాల దూరందాకా వచ్చినా వంగాల్సిన అవసరం ఉండదు. వాడు వంగలేదు కదా అని మనం అక్కడే ఉంటే వాడు జేబులో రాయి తీసి విసుర్తాడు అనుకో. మరి ఆ ప్రమాదాన్ని మనం ఎలా పసిగట్టగలుగుతాం?" అని తల్లికాకిని అడిగింది మూడో పిల్లకాకి.

తల్లికాకి మురిపెంగా కళ్ళనిండా ప్రేమను పొదువుకొని ఆ ప్రశ్న అడిగిన తన పిల్ల కాకిని చూస్తూ, "నీకు బతుకు తెరువును గురించి నేను నేర్పాల్సింది ఇంకేమీ లేదు. అందుకని ఈ క్షణం నుంచీ నీ బతుకు నువ్వు బతుకు" అంటూ మిగతా రెండు పిల్లల్నీ తీసుకొని గోడమీంచి ఎగిరి చక్కాపోయింది."

నేను కథ చెప్పడం ముగించాను. కథకు మించి ఒక్కమాట కూడా చలపతికి సలహాగా చెప్పలేదు. ఆ రాత్రి భోజనాలు చేసి చలపతి, నేనూ సాహిత్యం గురించి, స్నేహితుల గురించీ మాట్లాడుకున్నాం. మర్నాడు ఉదయం నేను బయలుదేరి గుంటూరు వెళ్ళిపోయాను.

* * *

కొన్నాళ్ళ తర్వాత చలపతి నుంచి నాకో ఉత్తరం వచ్చింది.

"ఒరేయ్ సూరీ!

నువ్వు కాకి కథ చెప్పి వెళ్ళిపోయి ఇప్పటికి రెండు నెలలు పైనే అయిందనుకొంటాను. ఇప్పటికిగాని నీకు ఉత్తరం రాయడం కుదర్లేదు. ఈ రెండు నెలల్లో ఇక్కడ చాలా పరిణామాలు జరిగాయి. కోడలు కాపురానికి వచ్చింది. మన పిల్లాడు ఆ పిల్ల ముందు చాలా కోతలు కోసినట్లున్నాడు. మనవాడి హైటెక్ మాటలు నమ్మిన ఆ పిల్లకు అత్తగారు శుద్ధ పల్లెటూరి మొద్దులా కనిపించింది. అదీగాక ఆ పిల్ల తన ఇంట్లో జ్యేష్ఠురాలు అయిన కారణంగా ఇంటి పెత్తనానికి అలవాటు పడింది కాబోలు. ఆ పద్ధతుల్ని ఇక్కడా అమలు చెయ్యాలని ప్రయత్నించింది. 'మా ఇంట్లో ఇలా కాదు', 'మా ఇంట్లో ఇలా చెయ్యం, అలా చెయ్యం' అనడంతో అత్తగారికీ, ఆ పిల్లకీ మధ్య చిన్న చిన్న గ్యాప్‌లు రావడం ప్రారంభమయ్యాయి. మా వాడికి బైట తిరగడం, రాత్రికి ఇంటికి చేరుకొని పెళ్ళాం పక్కన పడుకొని నిద్రపోవడం తప్ప పరిస్థితులు ఎలా ఉన్నాయి? ఓ కొత్త మనిషి కుటుంబంలోకి వచ్చి చేరింది కదా దానివల్ల కొత్త ప్రాబ్లమ్స్ ఏమైనా వస్తున్నాయా? వస్తే వాటికి కుటుంబ ఐక్యత చెడిపోకుండా ఎలా పరిష్కరించుకోవాలి అన్న విషయాలను పట్టించుకునే తీరిక, ఆలోచన, సామర్థ్యం, పరిశీలన, చట్టుబండలూ లేని కారణంగా అత్తా కోడళ్ళ మధ్య స్వల్ప కాలంలోనే పెద్ద గ్యాప్ వచ్చింది. తన గృహ సామ్రాజ్యాన్ని మరో మనిషి ఆక్రమించ ప్రయత్నించడానికి నా శ్రీమతి అంగీకరించదలచలేదు. ముప్ఫై ఏళ్ళుగా రూపొందించి నిర్వహిస్తోన్న సంసారానికి కోడలు వంకలు పెట్టడం ఆవిడకు భరించరాని విషయంగా తయారైంది. ఈ పరిస్థితి నాకు వాడి విషయంలో ఓ నిర్ణయం తీసుకోవడానికి ఎంతగానో ఉపకరించింది. నువ్వు చెప్పిన కథ కూడా నాకు అయోమయంగా ఉన్న పరిస్థితిని మబ్బులు విడగొట్టినట్లు విడగొట్టి చక్కటి మార్గాన్ని చూపించింది. ఆ కథ నుంచి నేను నేర్చుకున్న నీతి ఏమంటే పశుపక్ష్యాదులు సైతం పిల్లల విషయంలో అవసరం అయినంత వరకు అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించి, ఆపైన బాధ్యతాయుతంగా బాధ్యతలు వదిలించుకుంటాయని అర్థమైంది.

ఇప్పుడింక అసలు విషయానికి వస్తాను. మావాడి చేత వేరే సంసారం పెట్టించాను. వాడి కట్నం తాలూకు డబ్బు వాడికి ఇచ్చేశాను. వాడి వాటా కింద వచ్చే రెండు ఎకరాల పొలం వాడికి రాసి ఇచ్చేశాను. నీ ఇష్టం వచ్చినట్లు చేసుకో. నీతో పాటు నిన్ను నమ్మి నేను పరుగులు తీయలేను. నువ్వేకాక ఇంకా నీ ఇద్దరు తమ్ముళ్ళు, నీ తల్లి, నేనూ బతకాలి. వాళ్ళకూ ఓ దారి ఏర్పాటు చేయాల్సిన బాధ్యత నా మీద ఉంది. ఇంతమంది భవిష్యత్తుని నువ్వు తీర్చి దిద్దగలవు, అభివృద్ధి చేయగలవు అనే విశ్వాసం నాకు నువ్వు కలిగించలేకపోయావు. అందుకని వాళ్ళ భవిష్యత్తును నీ చేతిలో పెట్టలేను. నీ భవిష్యత్తును గురించి నీకు ఒకే ఒక్క మాట చెప్పదలచుకున్నాను. మనిషన్న ప్రతివాడికీ తనమీద తనకు విశ్వాసం ఉండాల్సిందే. కానీ, నీకు నీ మీద అతి విశ్వాసం ఉంది. అలాగే ప్రతివాడికీ స్వాభిమానం ఉండాల్సిందే కానీ, దురభిమానం ఉండకూడదు. కలలు కనాల్సిందేగానీ, కలల్లో జీవించకూడదు. కలకూ, జీవితానికీ ఉన్న తేడాను గమనించాలి. ఆశలుండాల్సిందే కానీ, దురాశలుండకూడదు. మన సామర్థ్యానికి తగ్గ పనులే ప్లాన్ చేసుకోవాలి. అంతకు మించి ప్లాన్ చేసుకంటే ఆ భారం కిందపడి నలిగిపోతావు. నువ్వు లక్షలు చిటికెలో సంపాదించగలను అనుకుంటున్నావు. అలా జరిగితే మంచిదే. కానీ, నా అనుభవంలో సంపాదించడం ఒక్కటే గొప్పతనం కాదు. దాన్ని నిలబెట్టుకోవడం అన్నిటికన్నా గొప్ప విషయం. నీకు స్వేచ్ఛనిస్తున్నాను జాగ్రత్త. స్వేచ్ఛ కరెంటులాంటిది. సక్రమంగా వాడుకోకపోతే షాక్ కొడుతుంది' అని చెప్పి పంపేశాను. నా నిర్ణయానికి నా భార్య కూడా అడ్డు చెప్పలేదు. నా కొడుకు ఎగిరి గంతేశాడు. నా కోడలు లోలోపలే సంతోషించి ఉండాలి.

ఇప్పుడు పెద్ద భారాన్ని దింపుకున్నంత హాయిగా ఉంది. ఇంతకాలం నేనే వేసుకొని బాధపడుతున్న సంకెళ్ళు తొలగిపోయాయి. ఇప్పుడు మళ్ళీ ప్రతిదీ నా అధీనంలోకి వచ్చిన అనుభూతి కలుగుతోంది. రాజు కోసం పెట్టిన చిన్న వ్యాపారం నేనే నడిపిస్తున్నాను. వ్యవసాయం కౌలుకు ఇచ్చేశాను. మిగతా పిల్లలిద్దర్నీ చదివిస్తున్నాను. నా శ్రీమతికి కూడా రెండు నెలలుగా ఎదుర్కొన్న చికాకు తగ్గినట్లుంది. ప్రశాంతంగా హ్యాపీగా ఉంది. నీకు ఖాళీ ఉన్నప్పుడు ఓసారి వచ్చి వెళ్ళు.

చలపతి.

చలపతి రాసిన ఉత్తరం చదివి చిన్నగా నవ్వుకున్నాను. ఆయనెవరో చెప్పినట్లు మనుషులు వాళ్ళకు వాళ్ళే అనవసరపు బరువులు నెత్తికెత్తుకొని బాధ పడతారు. అలా జరగడానికి హిపోక్రసీలూ, సెంటిమెంట్లూ, ఫాల్స్‌ప్రిస్టేజ్‌లూ, అతి మమకారాలూ కారణమవుతాయట. వాటిని ఛేదించుకుంటే హాయిగా ఎవరికోసం వాళ్ళు బతకవచ్చు. ఎవరి ఆట వాళ్ళే ఆడాలి. అందులో గెలుపైనా, ఓటమి అయినా అప్పుడు బాధ్యత వాళ్ళదే. ఈ సూత్రం పశుపక్ష్యాదులకు తెలిసి పాటించినంతగా మనుషులు పాటించకపోవడం ఎందుకనో అనుకున్నాను. చలపతి చివరికి సరైన నిర్ణయం తీసుకున్నాడని చాలా సంతోషించాను.

\- సమాప్తం

"నీకు బతుకు తెరువును గురించి నేను నేర్పాల్సింది ఇంకేమీలేదు. ఈ క్షణం నుంచీ నీ బతుకు నువ్వు బతుకు" అంటూ మిగతా రెండు పిల్లల్నీ తీసుకొని గోడమీంచి ఎగిరి పోయింది తల్లి కాకి.